సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం | 30 | జూలై | 2025



'మాచవరం' ఘటనపై కదిలిన యంత్రాంగం

బాలికపై కరస్పాండెంట్ అకృత్యానికి పాల్పడిన మాచవరం మార్గదర్శి పాఠశాల ఘటనపై కోనసీమ డీఈఓ విచారణ చేపట్టారు.


8లో



ఫుల్ వసూల్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు సంక్షేమ పథకాలను అందించనప్పటికీ, మద్యాన్ని మాత్రం 'ఫుల్'గా అందుబాటులోకి తీసుకువచ్చింది.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 6,01,844 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,300, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

అనుబంధ కమిటీల అధ్యక్షుల నియామకం

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అనుబంధ కమిటీల అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. వీరిద్దరూ మండపేట నియోజకవర్గానికి చెందిన వారే. పార్టీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా మరిశెట్టి సత్యనారాయణ, పార్టీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడిగా టపా గోవిందరావు నియమితులయ్యారు.

అక్రిడిటేషన్ల కోసం 5న నిరసనలు



సమావేశంలో అక్రిడిటేషన్లపై చర్చిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

అమలాపురం టౌన్: జిల్లాలోని నియోజకవర్గాల స్థాయిలో పాత్రికేయులు ఆగస్టు 5న సమావేశమై అక్రిడిటేషన్ల మంజూరు కోసం నిరసనలు తెలిపాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖ సమావేశం నిర్ణయించింది. అలాగే అదే రోజు జిల్లా ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలని స్పష్టం చేసింది. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెస్వీ ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ సమావేశం జరిగింది. జిల్లా అక్రిడిటేషన్ కమిటీకి ముగ్గురు సభ్యులను నామినేట్ చేయాల్సి ఉన్న దృష్ట్యా సమావేశం ఆ ఎంపికపై చర్చించింది. ఆగస్టు 17న ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లాలో భారీ స్థాయిలో నిర్వహించేందుకు సమావేశం తీర్మానం చేసింది. యూనియన్ జిల్లా కార్యదర్శి కాటే భీమ శంకరం, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కొర్లపాటి ప్రదీప్ కుమార్, ఉమ్మడి జిల్లా యూనియన్ మాజీ కార్యదర్శి సుంకర ప్రసాద్ మాట్లాడారు.

నేడు సత్యదేవుని హుండీల లెక్కింపు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో హుండీలను బుధవారం తెరచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి స్వామివారి నిత్య కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు.

ఆంక్షల జర్నీ!



- ఆర్టీసీ ఉచిత ప్రయాణానికి ఆదిలోనే బ్రేకులు
- ఆగస్టు 15 నుంచి అమలు చేస్తామంటున్న సర్కారు
- విధి విధానాలపై స్పష్టత కరవు
- ప్రయాణికులు పెరిగితే తప్పని అవస్థలు
- ఇప్పటికే బస్సుల కొరతతో ఆర్టీసీ

సాక్షి, అమలాపురం: అధికారమే పరమావధిగా ఎన్నికల ముందు అమలు సాధ్యం కాని హామీలు ఇవ్వడం, అధికారంలోకి రాగానే వాటిని పక్కన పెట్టేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధహస్తుడు. ఒకవేళ ప్రజల నుంచి విమర్శలు వస్తే పథకం అమలు పేరుతో ఆంక్షలు, నిబంధనల పేరుతో లబ్ధిదారులకు కోత పెట్టడం ఆయనకు



ఆర్టీసీ ప్రయాణికులు



ఉప్పలగుప్తం మండలం సరిపల్లికి బస్సు సౌకర్యం లేక ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న మహిళలు

సర్వసాధారణమే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు తర్వాత మహిళలకు ఉచిత బస్సు పథకానికి పథకం హామీ అమలు చేయనున్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి అమలు చేస్తామంటూ ముఖ్యమంత్రి, మంత్రులు పదే పదే ప్రకటనలు చేస్తున్నారు. ఇదే సమయంలో ఈ పథకం అమలు కాకుండానే లబ్ధిదారుల సంఖ్య ఆంక్షలతో కుదించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

జిల్లాలో నాలుగు డిపోలు

జిల్లాలోని అమలాపురం, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురాల్లో నాలుగు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 298 బస్సులు ప్రజలకు సేవలందిస్తున్నాయి. వీటిలో 139 పల్లె వెలుగు బస్సులు, 26 ఆల్ట్రా పల్లె వెలుగు, 26 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, 23 ఆల్ట్రా డీలక్స్ బస్సులు, 58 సూపర్ లగ్జరీ బస్సులు, 21 ఇంద్ర ఏసీ బస్సులు, రెండు అమరావతి, నాలుగు నైట్ రైడర్లు ఉన్నాయి. మొత్తం బస్సులు రోజుకు 1.23 లక్షల కిలోమీటర్ల మేర ప్రయాణం చేస్తున్నాయి. రోజుకు సుమారు 75 వేల మంది వరకు ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో సుమారు 23 వేల మంది వరకు మహిళా ప్రయాణికులు ఉంటారని అంచనా. అమలాపురం – కాకినాడ నాన్ స్టాప్, రాజమండ్రి – అమలాపురం, రావులపాలెం – అమలాపురం, అమలాపురం – రాజోలు, రామచంద్రపురం – ఆలమూరు మధ్య తిరిగే బస్సులలో రద్దీ అధికంగా ఉంటుంది. అలాగే దూరపు సర్వీసులలో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్‌లకు ప్రయాణికుల తాకిడి అధికంగా ఉంటుంది.

పల్లెకు అందని ఆర్టీసీ వెలుగు

జిల్లాలో సుమారు 385 గ్రామాలున్నాయి. వీటిలో దాదాపు 135 గ్రామాలకు నేరుగా బస్సు సౌకర్యం లేదు. 75 గ్రామాలకు బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ రోజులో ఒకటి రెండు ట్రిప్పులకు పరిమితమవుతున్నాయి. వీటిలో చాలా వరకు సముద్ర తీర ప్రాంత గ్రామాలు కావడం గమనార్హం. అయితే ఆర్టీసీ లెక్క మరో విధంగా ఉంది మొత్తం జిల్లాలో 307 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 256 గ్రామాల మీదుగా రాకపోకలు చేస్తున్నట్టు చెబుతోంది. పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించకుండా మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తే పెద్దగా ప్రయోజనం ఉండదని మహిళలు అభిప్రాయపడుతున్నారు. మరీ ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాల్లోని గ్రామాలకు ఒకటి రెండు బస్సు సర్వీసులు మాత్రమే నడపడం వల్ల ఆ ప్రాంత మహిళలకు ఒనగూరే ప్రయోజనం పెద్దగా కలగడం లేదు

ఉమ్మడి జిల్లానా? రాష్ట్రమంతటానా?

ఉచిత బస్సు ప్రయాణం అమలు విధివిధానాలు ఎప్పటికీ నిర్ధారణ కాలేదు. మరోవైపు ఈ పథకాన్ని ఆగస్టు 15 నుంచి అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. తొలుత ఉచిత ప్రయాణాన్ని ఉమ్మడి జిల్లాలకు మాత్రమే పరిమితం చేయాలని నిర్ణయించారు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ఒకరిద్దరు మంత్రులు రాష్ట్ర వ్యాప్తంగా దీనిని అమలు చేస్తామని చెబుతున్నారు. అయితే ఉచిత ప్రయాణాన్ని పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సులకు మాత్రమే పరిమితం చేయనున్నారు. దీనివల్ల మహిళలకు పెద్దగా ప్రయోజనం కలిగే అవకాశం లేదు. జిల్లా నుంచి విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాలకు సూపర్ లగ్జరీ, ఆల్ట్రా డీలక్స్, ఏసీ బస్సులు మాత్రమే తిరుగుతున్నాయి. ఈ రూట్‌లలో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు అనేవి దాదాపు లేవనే చెప్పవచ్చు.

ఈ బస్సులు చాలవు

జిల్లాలో 9.34 లక్షల మందికి మహిళలు ఉండగా, ప్రస్తుతం రోజుకు 23 వేల మంది వరకు ప్రయాణం చేస్తున్నారని అంచనా. ఉచిత ప్రయాణం మొదలైతే వీరి సంఖ్య రెట్టింపుకానుంది. సుమారు 45 వేల నుంచి 50 మంది మహిళలకు కేవలం 165 మాత్రమే బస్సులు ఉన్నాయన్నమాట. అయితే ఈ బస్సులు సరిపోవని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే బస్సుల కొరతతో ఆర్టీసీ ఇబ్బంది పడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కొక్క డిపోకు 50 కొత్త బస్సులు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఆ ఊసేలేదు. విద్యుత్ బస్సులను కొంటామని చెప్పారు. అవి కూడా డిపోలకు చేరలేదు.

శాంతిస్తున్న గోదారమ్మ



పి.గన్నవరం మండలం గంటిపెదపూడిలంక వద్ద వరదలో పడవ ప్రయాణం



ఐ.పోలవరం మండలం మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద వరద

ఐ.పోలవరం: గోదావరి వరద తగ్గుముఖం పడుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మంగళవారం ఉదయం స్వల్పంగా పెరిగిన వరద తొమ్మిది గంటల సమయం నుంచి నెమ్మదిగా తగ్గుతోంది. ఉదయం ఆరు గంటల సమయంలో బ్యారేజీ వద్ద 6,00,890 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఏడు గంటలకు 6,40,120 క్యూసెక్కులకు పెరిగింది. ఉదయం తొమ్మిది గంటల సమయంలో 6,37,240 క్యూసెక్కులకు, మధ్యాహ్నం ఒంటి గంటకు 6,09,540 క్యూసెక్కులకు, రెండు గంటలకు 6,00,100 క్యూసెక్కులకు తగ్గింది. సాయంత్రం ఆరు గంటలకు 6,00,100 క్యూసెక్కుల వద్ద వరద తగ్గింది. ఎగువ ప్రాంతాలలో వరద తగ్గడం వల్ల ఇది మరింత తగ్గుతోందని జల వనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నెలలో గోదావరికి రెండవసారి వచ్చిన వరద కూడా తొలి ప్రమాద హెచ్చరిక వరకు వెళ్లకుండా తగ్గడం పట్ల లంక వాసులు ఊపిరిపీల్చుకున్నారు.

లోవోల్టేజీ సమస్య లేకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: జిల్లాలో లోవోల్టేజీ సమస్య లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో ఏపీఈపీడీసీఎల్ ఇంజినీర్లతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ తీర ప్రాంతం వెంబడి లోవోల్టేజీ, విద్యుత్ కోత సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వినియోగదారుల కోసం ప్రత్యేక విభాగం ద్వారా విద్యుత్ సరఫరా, ఆక్వా కమర్షియల్‌కు రంగాలకు ప్రత్యేక సెక్షన్లుగా విభజించుకోవాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ పెంచాలని, పవర్ డిస్ట్రిబ్యూషన్ విద్యుత్ లైన్లను నవీకరించాలన్నారు. ఆగస్టు నెలాఖరుకు విద్యుత్ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించి, నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకంలో ఎస్సీ, ఎస్టీలకు యూనిట్లకు ఏర్పాట్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ బి.రాజేశ్వరి, ఈఈలు రాంబాబు, రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి గుణపాఠం

- ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై గురువుల కన్నెర్ర
- పోరుబాటకు సిద్ధమైన వైనం
- విద్యారంగ, ఆర్థిక సమస్యల పరిష్కారానికి డిమాండ్
- ప్రత్యక్ష చర్యకు నోటీసు ఇచ్చిన ఫ్యాప్టో నాయకత్వం
- ఆగస్టు 2న జిల్లా, 12న రాష్ట్ర స్థాయిలో ధర్నాలు



ముమ్మిడివరంలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల ధర్నా (ఫైల్)

రాయవరం: విద్యారంగ సమస్యలు, అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక సమస్యలకు తోడు ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలు ఉపాధ్యాయులకు తలకు మించిన భారంగా మారుతున్నాయి. బోధన మాటెలా ఉన్నా, బోధనేతర పనులకే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని వారందరూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పుడు కొత్తగా పీ 4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్, పార్టనర్ షిప్) కార్యక్రమాన్ని ఉపాధ్యాయులపై రుద్దడాన్ని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా తప్పుబడుతున్నాయి. తమ ఆర్థిక సమస్యలను పక్కన పెట్టడంతో పాటు తిరిగి తమను పీ4లో భాగస్వాములు కావాలని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నాయి. దీనిపై ప్రభుత్వం ప్రస్తుతానికి వెనక్కు తగ్గినట్లుగా చెబుతున్నాయి. అయినప్పటికీ అపరిష్కృత సమస్యలపై పోరుబాటకు సిద్ధమవుతున్నాయి. దీనిలో భాగంగా ఆగస్టు 2న అన్ని జిల్లా కేంద్రాల్లో, ఆగస్టు 12న రాష్ట్ర స్థాయిలో ధర్నా చేపట్టడానికి ఫ్యాప్టో పక్షాన నిర్ణయం తీసుకున్నారు.

ఉపాధ్యాయుల డిమాండ్లు

- పీ–4 కార్యక్రమాన్ని ఉపాధ్యాయులకు నిర్బంధం చేయరాదు.
- ఇటీవల అప్‌గ్రేడ్ అయిన స్థానాలను కోరుకున్న ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలి.
- పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలి. కలెక్టర్ పూల్ ద్వారా వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలి.
- 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేసి, 30శాతం ఐఆర్ ప్రకటించాలి.
- రిటైర్మెంట్ అయిన వారికి వెంటనే గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర బకాయిలు వెంటనే చెల్లించాలి.
- ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు మూడు పెండింగ్ డీఏలను ప్రకటించాలి.
- డీఏ బకాయిలు, 11వ పీఆర్సీ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలి.
- సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. 2004 సెప్టెంబరు 1వ తేదీకి ముందు విడుదలైన నోటిఫికేషన్ ద్వారా నియమితులైన వారందరికీ కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం అమలు చేసి, పాత పెన్షన్ విధానం తీసుకురావాలి.
- ఉపాధ్యాయులకు బోధన తప్ప ఏ ఇతర బోధనేతర కార్యక్రమాలు లేకుండా చేయాలి.
- హైస్కూల్ ప్లస్‌ల్లో వెంటనే ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టి, యథాతథంగా కొనసాగించాలి.
- ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలి. పరీక్షలను తెలుగులో రాసే అవకాశం కల్పించాలి.
- సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించి గ్రేడ్–2 పండిట్లు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలి.
- మున్సిపల్ ఉపాధ్యాయుల జీపీఎఫ్ తదితర సమస్యలను పరిష్కరించాలి.
- ఈహెచ్ఎస్/మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల విషయంలో నిత్యం ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరించాలి.
- మండల విద్యాశాఖాధికారుల బదిలీలు చేపట్టాలి.
- ఇంకా పదవీ కాలం పూర్తి కాని స్కూల్ గేమ్స్ సెక్రటరీలను తిరిగి కొనసాగించాలి.
- అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలి.

ధర్నా విజయవంతానికి కార్యాచరణ

ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా విజయవంతానికి కార్యాచరణ రూపొందించే పనిలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిమగ్నమయ్యారు. ఆగస్టు 2వ తేదీన చేపట్టే జిల్లా స్థాయి ధర్నాను విజయవంతం చేసేందుకు జిల్లా నాయకత్వాలు సమావేశం కానున్నాయి.

దశల వారీ పోరాటానికి సిద్ధం



ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధనకు దశల వారీ పోరాటానికి సిద్ధమవుతున్నాం. దానిలో భాగంగా ఆగస్టు 2న డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నాం. వేల మంది ఉపాధ్యాయులు తరలి వచ్చేలా కార్యాచరణ చేపడుతున్నాం.

– ఎంటీవీ సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు, ఫ్యాప్టో

ఆర్థిక సమస్యలు పరిష్కరించాలి



కొంతకాలంగా ఉపాధ్యాయ సంఘాల నుంచి తీసుకున్న ఏ ఒక్క వినతిపైనా సానుకూలంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం లేదు. ఉపాధ్యాయుల ఆర్థిక పరమైన సమస్యలపై కనీస స్పందన లేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలపై మాట్లాడి, అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి నాయకులు వ్యవహరిస్తున్న తీరు విచారకరం.

– పోతంశెట్టి దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఫ్యాప్టో

క్లుప్తంగా

ఆరో నిందితుడి అరెస్ట్

అమలాపురం టౌన్: దోనిపాటి మహేష్‌పై దాడి చేసినందుకు నమోదైన హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లికి చెందిన కొత్తపల్లి దుర్గా మహేష్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే యల్లమెల్లి విజయ్ రవి శంకర్, ఉరదల బాలరాజు, యర్రా కృష్ణ, మల్లాడి సుదర్శన్, తోట నాగ వెంకట సత్యనారాయణలను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అరెస్ట్ చేసిన దుర్గా మహేష్‌ను అమలాపురంలో కోర్టులో హాజరు పర్చగా, అతడికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. ఆరుగురినీ సెంట్రల్ జైలుకు తరలించామన్నారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ

నల్లజర్ల: వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఈ నెల 31న తేనెటీగల పెంపకం – శాస్త్రీయ పద్ధతులపై శిక్షణ ఇస్తున్నట్టు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.విజయలక్ష్మి తెలిపారు. ఆరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తేనెటీగల యాజమాన్యం, తేనె తీసే విధానం, నిల్వ, తేనెటీగల పెంపకంలో సమస్యలు, పురుగులు, తెగుళ్ల యాజమాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని స్త్రీలు, రైతులు, ఈ వ్యాపారం చేయాలనుకునే ఈ శిక్షణకు హాజరుకావచ్చన్నారు. మరిన్ని వివరాలకు 73826 33692, 94905 05926 నంబర్లను సంప్రదించాలన్నారు.

యువకుడిని కాపాడిన పోలీసులు



యువకుడిని కాపాడిన నిడదవోలు పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు, సిబ్బంది

నిడదవోలు: రైల్వేట్రాక్‌పై ఆత్మహత్య చేసుకోబోయిన యువకుడిని నిడదవోలు పోలీసులు కాపాడారు. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇవీ. సుమారు 25 ఏళ్ల యువకుడు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీంతో నిడదవోలు పోలీస్ స్టేషన్ పరిధిలో రైల్వే ట్రాక్‌కు చేరుకున్నాడు. ఆ యువకుడిని గమనించి ఓ వ్యక్తి వెంటనే 112 కాల్ ద్వారా జిల్లా పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు నిడదవోలు పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు, తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లారు. ఆ యువకుడి ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అతడి బంధువులకు సమాచారం అందించి, కౌన్సెలింగ్ ఇచ్చారు.

బాలికపై వీధి కుక్కల దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక

కడియం: కడియపుసావరం గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై మంగళవారం మూడు వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో బాలిక కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆడుకునేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చిన బాలికపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. గమనించిన స్థానికులు వాటిని అదిలించడంతో బాలికను వదిలేసి పారిపోయాయి. గాయాలపాలైన బాలికకు కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా.. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడంతో కడియం మండల వ్యాప్తంగా వీధి కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని ప్రజలు చెబుతున్నారు.

ఫుల్ వసూల్

- యథేచ్ఛగా మద్యం అమ్మకాలు
- పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు
- నిబంధనలు బేఖాతరు
- ఏరులై పారుతున్న మద్యం
- రూ.కోట్లలో అక్రమార్జన

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు సంక్షేమ పథకాలను అందించనప్పటికీ, మద్యాన్ని మాత్రం అందుబాటులోకి తీసుకువచ్చింది. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా అన్నిచోట్లా మద్యం షాపులు ఏర్పాటు చేసింది. దీనికి తోడు విచ్చలవిడిగా పెరిగిన బెల్టుషాపులతో మద్యం ఏరులై ప్రవహిస్తోంది. ఈ షాపుల్లో అమ్మకాల ద్వారా అక్రమార్జన ఎడాపెడా జరుగుతోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో లైసెన్స్ మద్యం షాపులు 150 లోపు ఉంటే, బెల్ట్ షాపులు దానికి దాదాపు ఏడు రెట్లు పెరిగాయి. లైసెన్స్ దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌ల పేరుతో మద్యం అమ్మకాలు ఫుల్‌గా సాగుతున్నాయి. బెల్ట్ షాపుల ద్వారా అక్రమంగా సరకును అమ్మేస్తున్నారు. లైసెన్స్ మద్యం షాపులకు అనుబంధంగా **బెల్ట్ షాపులు ఉండవని, ఒక వేళ బెల్ట్ షాపుల్లో మద్యం పట్టుబడితే, సంబంధిత లైసెన్స్ షాపునకు రూ.5 లక్షలు జరిమానా విధించడంతో పాటు లైసెన్స్ కూడా రద్దు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎక్సైజ్ అధికారులు చేస్తున్న ప్రకటనలు** ఆచరణలో అమలు కావడం లేదు.

వెయ్యికి పైగా బెల్ట్ షాపులు

జిల్లాలో అధికారికంగా 146 లైసెన్స్‌డ్ మద్యం షాపులు, 10 బార్లు ఉన్నాయి. ఈ 146 అధికారిక షాపులకు అనుసంధానంగా దాదాపు వెయ్యికి పైగా బెల్ట్ షాపులు అనధికారికంగా నడుస్తున్నాయి. కలెక్టర్ ఇటీవల జిల్లా ఎక్సైజ్ అధికారులతో ఓ సమావేశం నిర్వహించారు. బెల్ట్ షాపులకు ఏ విధమైన ఆస్కారం లేకుండా మద్యం షాపుల ద్వారానే విక్రయాలు జరగాలని ఆదేశించారు. అయితే ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణా వైఫల్యం, లైసెన్స్ మద్యం షాపుల వారితో లాలూచీ వంటి కారణాలతో జిల్లాలో బెల్ట్ షాపులకు కొదవ లేకుండా పోయింది. మామూళ్ల మత్తుతోనే పర్మిట్ రూమ్‌లను, బెల్ట్ షాపులను చూసీ చూడనట్లు వదిలేస్తున్నారన్న ఆరోపణలు బాహటంగా వినిపిస్తున్నాయి.



అయినవిల్లిలో ఓ బెల్ట్ షాపు



అమలాపురం సమీపంలో ఓ షాపు వద్ద మద్యం తాగుతున్న మందుబాబులు

మామూళ్ల మత్తులో!

ఎక్సైజ్ అధికారులను బెల్ట్ షాపుల గురించి అడిగితే ఎక్కడ ఉన్నాయని ఎదురు ప్రశ్నించే స్థాయిలో ఉన్నారు. బెల్ట్ షాపుల నిర్వహణలో ఆరి తేరిన వారుంటే, అలాంటి వారిపై లైసెన్స్ షాపుల యాజమానులతో మాట్లాడి పరస్పర అంగీకారం, అవగాహనతో కొందరిపై బైండోవర్ కేసులు నమోదు చేయడం ఎక్సైజ్ అధికారులకు పరిపాటైపోయింది. అయితే పొరుగున్న ఉన్న పాండిచ్చేరి, యానాం నుంచి అక్రమ మద్యాన్ని (నాన్ డ్యూటీ పెయిడ్) తరలిస్తుంటే అధికారులు మాత్రం అలాంటి మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. అయితే కాట్రేనికోన తదితర మండలాల్లో రిమోట్ గ్రామాల్లో కొన్ని మద్యం షాపులు ప్రైవేటు వేలం పాట పరమవుతున్నా పట్టించుకోరు సరికదా, అసలు తమకు తెలియనట్లే వ్యవహరిస్తున్నారు. లైసెన్స్ షాపుల నుంచి సంబంధిత అధికారులకు ప్రతి నెలా అందుతున్న మామూళ్లతో ఇలా జరుగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి.

అక్రమంగా అమ్మకాలకు ప్రోత్సాహం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అవుట్ లెట్ల ద్వారా ప్రభుత్వమే పరిమితంగా మద్యం షాపులను నిర్వహిస్తే, ఈ కూటమి ప్రభుత్వం ప్రజల చేత మద్యాన్ని ఫుల్‌గా తాగించి అమ్మకాలను అయినకాడికి పెంచేసి, తద్వారా వచ్చే ఆదాయానికి ఆశపడి ఈ అడ్డదారులు తొక్కుతోంది. మద్యం విక్రయాలను అటు లైసెన్స్ షాపుల ద్వారా ఇటు బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్‌ల ద్వారా అదనంగా అమ్మేసి అక్రమార్జనకు పాల్పడుతోంది. ప్రజల జీవితాలు, ఆరోగ్యాలతో పని లేదన్నట్లుగా, మద్యం అమ్మకాలే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతూ జిల్లాలో అక్రమ మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తోంది.

మందుబాబులకు పండగే

జిల్లా కేంద్రమైన అమలాపురంలోని ఎక్సైజ్ కార్యాలయం సమీపంలోనే కొన్ని లైసెన్స్ షాపులకు పర్మిట్ రూమ్‌లు ఉన్నాయి. బారులతో సమాంతరంగా మద్యం షాపుల వద్ద కూడా మందుబాబులు ఫుల్‌గా తాగేస్తున్నారు. ఇక గుడి, బడి నిబంధనలను బెల్ట్ షాపుల నిర్వాహకులు అసలు పాటించడం లేదు. బెల్ట్ షాపు పెట్టడమే ఓ నేరమైతే గుడి, బడికి 200 మీటర్ల దూరంలో పెట్టడం మరో నేరం. ఉదాహరణకు అమలాపురం రూరల్ మండలం బండార్లంక గ్రామంలో ఇలా బడి, గుడి నిబంధనలకు నీళ్లొదిలి బెల్ట్ షాపులు వెలిశాయి. అమలాపురం రూరల్, అయినవిల్లి, అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాలతో పాటు జిల్లాలో అసలు బెల్ట్ షాపుల లేని గ్రామాలు లేవంటే అతిశయోక్తి కాదు.



అల్లవరం మండలం కొమరిగిరిపట్నంలోని నకిలీ మద్యం తయారీతో పట్టుబడ్డ ఏసీ బ్లాక్ పేరుతో లేబుళ్ల బండిల్ (ఫైల్)

నకిలీ మద్యం కేసు

గత టీడీపీ ప్రభుత్వంలో, ఇప్పటి కూటమి ప్రభుత్వంలో బెల్ట్ షాపులతో మద్యం అక్రమ అమ్మకాలు సాగితే, అల్లవరం మండలం కొమరిగిరిపట్నంలో ఏకంగా నకిలీ మద్యం తయారీ కేంద్రం గుట్టురట్టు కావడంతో కోనసీమ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏసీ బ్లాక్ పేరుతో నకిలీ మద్యం తయారీ యూనిట్‌ను, ఈ అక్రమ వ్యాపారంలో పాత్రధారులను ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసులో సూత్రధారులైన పెద్దలను వదిలేసి పాత్రధారులైన చిన్న వారిని మాత్రమే అరెస్ట్ చేశారన్న విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. ఈ నకిలీ దందా ఇక్కడ నుంచి సాగుతూ కోనసీమలోని పలు బెల్ట్ షాపులకు నకిలీ మద్యాన్ని సరాఫరా చేశారన్న గుసగుసలు కూడా వినిపించాయి. కేవలం కేరామిల్ లిక్విడ్, స్పిరిట్‌తో నకిలీ మద్యాన్ని తయారు చేసి నకిలీ లేబుళ్లతో ఓ బాటిలింగ్ యూనిట్‌నే మెయింటెన్స్ చేస్తున్న ఈ నకిలీ ముఠా స్థావరాన్ని చూసి ప్రజలు అవాక్కయ్యారు. రూ.10 కోట్ల మేర ఈ నకిలీ మద్యం కేంద్రం నుంచి పక్కదారి పట్టిందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ బాహటంగా స్పష్టం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో బెల్ట్ షాపుల కల్చర్ గత టీడీపీ ప్రభుత్వం కంటే రెట్టింపు అయ్యిందని ఆందోళన వ్యక్తం చేశారు.

చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి అవసరం

- పారిశ్రామిక వేత్త మట్టే శ్రీనివాస్
- 'నవోదయ'లో కబడ్డీ మీట్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న పారిశ్రామికవేత్త శ్రీనివాస్

పెద్దాపురం: ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త, లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేత మట్టే శ్రీనివాస్ అన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో మూడు రోజుల పాటు నిర్వహించే క్లస్టర్ స్థాయి కబడ్డీ మీట్‌ను మంగళవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగిన కబడ్డీ మీట్‌నుద్దేశించి శ్రీనుబాబు మాట్లాడుతూ ఉన్నత విద్యతో పాటు క్రీడారంగానికి ప్రాధాన్యనివ్వడంలో నవోదయ విద్యాలయాల పాత్ర కీలకమన్నారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి కృష్ణా క్లస్టర్, తుంకుర్ క్లస్టర్ అండర్-19 బాలుర లీగ్ మ్యాచ్ కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీ సత్యనారాయణ, అనురాధ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, తెలంగాణ, ఏపీ, కర్ణాటక ప్రాంతానికి చెందిన 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫస్టియర్‌కు కొత్త సిలబస్



మాట్లాడుతున్న ఇంటర్ విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆదినారాయణ

అమలాపురం టౌన్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పాఠ్య పుస్తకాలు మారడం వల్ల కొత్త సిలబస్‌లో వచ్చిన మార్పులను గమనించి విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలని ఇంటర్మీడియట్ విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేసీ) ఎం.ఆదినారాయణ సూచించారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం సిలబస్ కూడా మారుతుందని తెలిపారు. అమలాపురంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో డీఐఈవో వనుము సోమశేఖరావు అధ్యక్షతన మంగళవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆర్‌జేసీ ఆదినారాయణ మాట్లాడారు. జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు కష్టపడి విద్యార్థులను చదివించి, ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులతో ఆర్‌జేడీ వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి మారుతున్న సిలబస్‌ను వివరించారు. మారుతున్న సిలబస్‌కు అనుగుణంగా ఉండాల్సిన విద్యా బోధనపై చర్చించారు.

పురుగుమందు తాగి కమ్యూనిస్టు నాయకుడి మృతి



మచ్చా నాగయ్య (ఫైల్)

అయినవిల్లి: మండలానికి చెందిన ప్రముఖ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు మచ్చా నాగయ్య పురుగుమందు తాగి మృతి చెందారు. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు నాగయ్య సోమవారం ముక్తేశ్వరంలోని ఎరువుల దుకాణంలో పురుగు మందు కొనుగోలు చేశారు. అనంతరం అయినవిల్లిలంకలోని తన కొబ్బరితోటలో ఆ మందు తాగేశారు. అయితే కడుపులో మంట భరించలేక రోడ్డు మీదకు వచ్చి ఆ విషయాన్ని స్థానిక యువకులకు తెలిపారు. వెంటనే ఆతడిని అంబులెన్స్‌లో అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. అమలాపురంలోని ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. పలువురు ప్రముఖులు ఆయన మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అనంతరం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. నాగయ్య బంధువుల ఫిర్యాదుపై అయినవిల్లి ఎస్సై శాస్త్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దేవుడి పేరుతో ఇసుక దోపిడీ!

- కూటమి నాయకుల అక్రమ దందా
- అడ్డుకున్న గ్రామస్తులు



ఆత్రేయపురంలో ఇసుక స్టాక్ పాయింట్

కొత్తపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. నిబంధనలను అతిక్రమించి యథేచ్ఛగా తరలించేస్తున్నారు. చివరకు దేవుడి పేరును వాడుకుని మరీ అక్రమ దందాకు పాల్పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆత్రేయపురం అధికారిక ఇసుక ర్యాంపు సమీపంలో ప్రజల అవసరాల కోసం స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి ఇసుక నిల్వలు పెట్టారు. ఆ పాయింట్ నుంచి ఆదివారం రాత్రి అక్రమంగా ఇసుక రవాణాను ప్రారంభించారు. దీన్ని గమనించిన స్థానికులు సోమవారం రాత్రి మాటు వేసి ఇసుక రవాణాను అడ్డుకున్నారు. ఎందుకు ఇసుక తరలిస్తున్నారని గ్రామస్తులు నిలదీస్తే, వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి క్షేత్రంలో అభివృద్ధి పనులకు తీసుకువెళుతున్నామని అక్రమార్కులు సమాధానం చెప్పారు. ఆలయానికి అయితే అర్ధరాత్రి దొంగతనంగా తరలించడమేమిటి, పగటి పూటే తోలుకోవచ్చు కదా అని ప్రశ్నించడంతో ఇరు వర్గాల మాటామాటా పెరిగి వివాదం తలెత్తింది. ఈ లోపు పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను సముదాయించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించాలని గ్రామస్తులు పట్టుపట్టగా, అది రెవెన్యూ అధికారుల పని అని చెప్పి, వాహనాలను అక్కడి నుంచి పంపించేశారని పలువురు స్థానికులు తెలిపారు. దీనిపై ఎస్సై రామును 'సాక్షి' వివరణ కోరగా అక్కడ గొడవ పడుతున్నారనే సమాచారంతో రెవెన్యూ సిబ్బందితో కలిసి వెళ్లి ఇరువర్గాలను అక్కడి నుంచి పంపిచేశామని తెలిపారు. వాహనాలేమీ సీజ్ చేయలేదని స్పష్టం చేశారు.

మండల స్థాయి నాయకుడి ఆగడాలు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక మండలంలో టీడీపీ నాయకులు ముఖ్యంగా ఒక మండల స్థాయి నాయకుడి ఆగడాలు, అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఆ నాయకుడి అక్రమ వ్యవహారాల్లో భాగంగానే గత నెల 16, 17 తేదీల్లో ఆత్రేయపురం చినపేట సమీపం నుంచి లంక భూముల్లోకి అక్రమంగా ర్యాంపు ఏర్పాటు చేసి మట్టి తరలించే ప్రయత్నాలు చేయగా స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడం, వారు స్పందించకపోవడంతో గ్రామస్తులే అడ్డుకున్నారు. అప్పట్లో వారి ప్రయత్నాలు తాత్కాలికంగా నిలిచిపోయిన విషయం తెలిసిందే.

పెళ్లి భయంతో పారిపోయిన బాలికలు

- తల్లుల ఫిర్యాదుపై స్పందించిన ఇంద్రపాలెం పోలీసులు
- గంటల వ్యవధిలోనే ఆచూకీ లభ్యం



బాలికలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఇంద్రపాలెం పోలీసులు

కాకినాడ రూరల్: ఇంటిలోని పెద్దలు పెళ్లి సంబంధాలు చూస్తుండడంతో ఆ బాలికలు భయపడిపోయారు. తమకు ఇష్టం లేకపోయినా పెళ్లి చేస్తారనే ఆందోళనతో ఇంటి నుంచి పారిపోయారు. వారి తల్లుల ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే స్పందించి ఆ బాలికల ఆచూకీ గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. కరప మండలం అచ్యుతాపురానికి చెందిన ఇద్దరు బాలికలు వరసకు అక్కాచెల్లెళ్లు (అన్నదమ్ముల పిల్లలు) అవుతారు. వీరిలో ఒకరు ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, మరొకరు పదో తరగతి చదువుతున్నారు. వీరిద్దరికీ పెద్దలు పెళ్లి సంబంధాలు చూడడం ప్రారంభించారు. తమకు ఇష్టం లేని పెళ్లిళ్లు చేస్తారనే భయం వారికి పట్టుకుంది. పెద్దలను ఎదిరించలేక, ఇంటి నుంచి పారిపోయేందుకు పథకం వేసుకున్నారు. సోమవారం ఉదయం ఇంటి నుంచి కాలేజ్, స్కూల్‌కు అని చెప్పి బయలుదేరారు, మధ్యాహ్నం మూడు గంటలకు కాకినాడ నుంచి తప్పించుకుని పారిపోయారు. రాత్రయినా ఇద్దరు పిలలూ ఇంటికి రాకపోవడంతో కంగారు పడిన తల్లిదండ్రులు చుట్టుపక్కల అన్నిచోట్లా వెతికారు. ఫలితం లేకపోవడంతో రాత్రి పది గంటలకు ఇంద్రపాలెం పోలీసులను ఆశ్రయించారు. బాలికల తల్లుల ఫిర్యాదు మేరకు ఎస్సై వీరబాబు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. బాలికలు అమలాపురం వైపు వెళ్లినట్టు టెక్నాలజీ ఆధారంగా గుర్తించి, అక్కడి పోలీసుల సహకారంతో మూడు గంటల వ్యవధిలోనే పట్టుకోగలిగారు. బాలికలను మంగళవారం ఉదయం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ బిందు మాధవ్, ఏఎస్పీ పాటిల్ దేవరాజ్, రూరల్ సీఐ చైతన్య కృష్ణ, సిబ్బంది, అమలాపురం పోలీసుల సహకారంతో తక్కువ సమయంలో బాలికల ఆచూకీ కనుగొన్నామని ఎస్సై వీరబాబు తెలిపారు.

'మాచవరం' ఘటనపై కదిలిన యంత్రాంగం

- డీఈవో సలీం బాషా విచారణ
- బాలిక తల్లిదండ్రులతో మాట్లాడిన వైనం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ట్రైనీ డీఎస్పీ, సీఐ



మాచవరంలోని ప్రైవేటు పాఠశాలలో విచారణ చేస్తున్న డీఈవో సలీం బాషా



తలుపులు లేకుండా అధ్వానంగా ఉన్న పాఠశాలలోని మరుగుదొడ్డి

రాయవరం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకునేందుకు, అవసరమైన పక్షంలో మూసివేసేందుకు వెనుకాడబోమని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా హెచ్చరించారు. మాచవరంలోని మార్గదర్శి పాఠశాలలో బాలికను ఆ స్కూల్ కరస్పాండెంట్ గర్భవతిని చేసిన ఘటనపై మంగళవారం ఆయన విచారణ చేపట్టారు. రాయవరం ఎంఈవో-1 పి.రామలక్ష్మణమూర్తి ద్వారా ప్రాథమిక సమాచారం తెలుసుకున్న ఆయన హుటాహుటిన మాచవరం గ్రామానికి చేరుకున్నారు. ఆ స్కూల్లో ఎటువంటి అనుమతులు లేకుండా 8, 9, 10 తరగతులు నిర్వహిస్తున్నట్లుగా గుర్తించారు. ప్రస్తుతం ఒకటి నుంచి 7వ తరగతి వరకు 49 మంది విద్యార్థులు చదువుతున్నారని పాఠశాల రికార్డుల ద్వారా తెలుసుకున్నారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు ముఖ్యంగా మరుగుదొడ్లకు తలుపులు కూడా లేకపోవడంపై డీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం పాఠశాలలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. అలాగే బాలిక కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం పాఠశాల గుర్తింపును రద్దు చేసే విషయాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. విచారణ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు ఇటువంటి పాఠశాలలను మూసివేసేందుకు చర్యలు తీసుకోవాలని డీఈవోకు విన్నవించారు. ఆయన వెంట ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన, ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, సమగ్ర శిక్షా జీసీడీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ డి.రమేష్ బాబు తదితరులు ఉన్నారు.

ట్రైనీ డీఎస్పీ విచారణ

మాచవరంలో బాలిక ఘటనపై ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, మండపేట సీఐ పి.దొరరాజుతో కలిసి విచారణ చేపట్టారు. ఆ బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో పాఠశాలలో నేర స్థలాన్ని పరిశీలించారు. మాచవరంలో ప్రైవేట్ పాఠశాలను కరస్పాండెంట్ ఆకుమర్తి షాజీ జయరాజ్ కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నాడు. పాఠశాలలో చదువుకోవడానికి వచ్చిన బాలికను లోబర్చుకుని, ఆమెను భయపెట్టి గర్భవతిని చేసినట్లుగా ప్రాథమిక విచారణలో అధికారులు గుర్తించారు. గతంలో కూడా పాఠశాలలో ఇలాంటి కొన్ని ఘటనలు జరగ్గా, పరువు పోతుందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయకుండా మిన్నకుండినట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది. అయితే తమ కూతురికి జరిగిన అన్యాయం మరెవరికీ జరగకూడదనేఉద్దేశంతోబాలిక తండ్రి ఆ పాఠశాల కరస్పాండెంట్ షాజీ జయరాజుపై పోలీసులకు ఫిర్యాదుచేశారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నట్లుగా పోలీసులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే రాయవరం ఎస్సై డి.సురేష్ బాబు సోమవారం రాత్రి జరిగిన ఘటనపై పోక్సో కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.